## మిడ్ మానేరు నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): మిడ్ మానేరు నిర్వాసితులకు 4,696 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. స్టేట్ రిజర్వు కోటా కింద మంజూరు చేసిన ఈ ఇండ్లకు అర్హత నిబంధనలను సడలించారు. లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కింద రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 12 గ్రామాల్లో 10,683 కుటుంబాలు ప్రభావితం అయ్యాయి. వారికి ఇదివరకే ఇంటి పట్టాలు అందించగా, ఇందులో 5987మంది ఇండ్లు నిర్మించుకున్నట్టు ప్రభుత్వానికి కలెక్టర్ తెలిపారు. మిగతా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఎలక్ట్రిక్ వాహనాలకు ఫ్రీ రిజిస్ట్రేషన్

- జీహెచ్ఎంసీ పరిధిలో భారీగా ఎలక్ట్రిక్ బస్సులు: పొన్నం

హైదరాబాద్, నవంబర్ 17(నమస్తేతెలంగాణ): తెలంగాణలో సోమవారం నుంచి నూతన ఈవీ పాలసీ రానుందని రాష్ట్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు జీవో 41 ద్వారా కొత్త ఈవీ(ఎలక్ట్రిక్ వెహికల్) పాలసీ తీసుకొచ్చామని, ఇది 2026 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుందని స్పష్టంచేశారు. జీవో ప్రకారం.. ఈవీల్లో 4వీలర్స్, టూ వీలర్స్, కమర్షియల్ వెహికల్స్‌కు వందశాతం పన్ను మినహాయింపు, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో సగటున ప్రతి ఏడాది కొత్తగా 5 లక్షల కొత్త వాహనాలు చేరుతున్నాయని, 6 నుంచి 8 శాతం అదనపు కార్బన్ ఏర్పడుతుందని వాపోయారు. దీంతో వాయు కాలుష్యం పెరిగినట్లు గుర్తించామని తెలిపారు. కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా హైదరాబాద్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలా హైదరాబాద్‌లో కాలుష్యం సమస్య తలెత్తకూడదని ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తున్నామని తెలిపారు. పెట్రోల్, డీజిల్ వాహనాల వినియోగం, వాహనాల రిపేర్‌లతో పోలిస్తే ఈవీ వాహనాల వల్ల వినియోగదారులకు ఏడాదికి రూ.లక్ష మిగులుతుందని చెప్పారు. ప్రజలు ఎలక్ట్రిక్ వెహికల్స్ కొనుగోళ్లపై దృష్టి పెట్టాలని మంత్రి పొన్నం సూచించారు.

## స్టేషన్ ఘన్‌పూర్‌లో సమీకృత డివిజనల్ ఆఫీస్

హైదరాబాద్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ లెవల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 26 కోట్లు మంజూరు చేసింది. రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు.

## 22 జిల్లాల్లో మహిళా శక్తి భవనాలు

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ. 5 కోట్ల చొప్పున మొత్తం రూ. 110 కోట్ల అంచనాతో పరిపాలనా అనుమతులిస్తూ ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. మేడ్చల్ మల్కాజిగిరి, మంచిర్యాల, రాజన్నసిరిసిల్ల, హనుమకొండ, కామారెడ్డి, నిజామాబాద్, ములుగు, నారాయణపేట, జగిత్యాల, భూపాలపల్లి, వనపర్తి, మెదక్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, పెద్దపల్లి, గద్వాల జిల్లాల్లో మహిళాశక్తి భవనాలను నిర్మించనున్నారు. 19న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వీటికి శంకుస్థాపన చేయనున్నారు.

## విజయోత్సవ సభపై మంత్రి సమీక్ష..

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): హనుమకొండలో 19న ప్రజాపాలన విజయోత్సవ సభపై సచివాలయంలోని తన చాంబర్‌లో ఆదివారం మంత్రి సీతక్క అధికారులతో సమీక్షించారు. సీఎం పాల్గొంటున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సభలో ప్రకటించే నూతన పథకాల విధివిధానాలు, సభా ప్రాంగణంలో స్టాళ్ల ఏర్పాటుపై చర్చించారు. సమీక్షలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితారామచంద్రన్, డైరెక్టర్ క్రాంతి వెస్లీ పాల్గొన్నారు.

# సర్వే నత్తనడక!

- చదువులు ఆగమాయె.. సర్వే సాగదాయె!
- 1.16 కోట్ల ఇండ్లు గుర్తింపు
- రాష్ట్రంలో ఇంకా స్టిక్కరింగ్ చేయని ఇండ్లే లక్షల్లో
- పూర్తయింది 44 శాతమే
- సగానికి పైగా ఇండ్లు.. వారం రోజులే గడువు
- సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అనాలోచితమంటూ విమర్శలు

హైదరాబాద్, నవంబర్17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే నత్తనడకన కొనసాగుతున్నది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా.. ఇంకా సగం ఇండ్ల సర్వే కూడా పూర్తికాలేదు. మరోవైపు అరకొరగానే వివరాలు నమోదు చేయాల్సి వస్తున్నదని ఎన్యూమరేటర్లే పెదవి విరుస్తున్నారు. కుటుంబ వివరాలు తప్ప చాలా మంది ఆస్తులు, ఆదాయ సమాచారమే ఇవ్వడం లేదని తేల్చి చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల)ను ఈ నెల 6న మొదలు పెట్టింది. ఈ నెల 26 కల్లా సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు గణాంకాల సేకరణకు 87,807 మంది ఎన్యూమరేటర్లను, 8,788 అధికారులను పర్యవేక్షకులుగా నియమించింది. మొత్తంగా 52,493 గ్రామీణ, 40,901 అర్బన్ బ్లాకులుగా విభజించింది. తొలుత 3 రోజులపాటు సర్వే చేపట్టాల్సిన ఇండ్ల గుర్తింపు ప్రక్రియను ఎన్యూమరేటర్లు చేపట్టారు. మొత్తంగా 1,16,14,349 ఇండ్లను మార్కింగ్ చేసినట్టు వెల్లడిస్తున్నారు. ఈ ఇండ్ల గుర్తింపు ప్రక్రియ కూడా చాలాచోట్ల సవ్యంగా సాగలేదని ఆరోపణలు ఉన్నాయి. అర్బన్ ప్రాంతాల్లో గృహ యజమానులైతే ఇండ్ల గుర్తింపునకు నిరాకరించారు. ఎన్యూమరేటర్లు మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఇంకా లక్షలాది ఇండ్లను గుర్తించనే లేదని లేదని తెలుస్తున్నది.

### ఒక్కో ఇంటికి 45 నిమిషాలు

రెండో దశలో భాగంగా 9 నుంచి గుర్తించిన ఇండ్ల వివరాల నమోదును ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్తున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్ సగటున 150 ఇండ్లను కేటాయించారు. ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకూ 15 ఇండ్లకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని నిర్దేశించారు. ఈ ప్రక్రియ పూర్తిగా నత్తనడకన కొనసాగుతున్నదని తెలుస్తున్నది. ప్రధాన, ఉప ప్రశ్నలతో కలిపి మొత్తంగా 75 ప్రశ్నలకు పైగా సమాచారాన్ని సేకరించి ఫారాన్ని నింపాల్సి ఉన్నది. ఒక్కో ఫారాన్ని నింపడానికి సగటున 30 నుంచి 45 నిమిషాల సమయం పడుతున్నదని తెలుస్తున్నది. మధ్యాహ్నం భోజనం అనంతరం సర్వేను ప్రారంభించినా సాయంత్రానికి కల్లా కనీసం 10 ఇండ్ల సమాచారాన్ని కూడా సేకరించలేకపోతున్నారు. ఈ నెల 26 కల్లా సర్వే పూర్తిచేయాలన్న గడువు ఉన్నది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 లక్షల ఇండ్ల సర్వే పూర్తికావాల్సి ఉండగా, 51,24,542 ఇండ్లలో అంటే 44.1 శాతం మాత్రమే సర్వే పూర్తయిందని ఉన్నతాధికారులు వెల్లడించారు. దీనిని బట్టే సర్వేలో జరుగుతున్న జాప్యాన్ని అర్థం చేసుకోవచ్చు. నిర్దేశిత గడువులో ఇండ్ల సర్వేను పూర్తిచేయడం కష్టమేనని ఎన్యూమరేటర్లే తేల్చి చెప్తున్నారు. గడువు పెంచాలని ఇప్పటికే సూపర్‌వైజర్లకు, ఉన్నతాధికారులను పలువురు ఎన్యూమరేటర్లు కోరారు.

### డాటా ఎంట్రీకి ఎన్నిరోజులో?

సర్వే పూర్తయితే, వాటి డేటా ఎంట్రీని కూడా డిసెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో వివరాల నమోదు సవాల్‌గా మారి, సర్వే ప్రక్రియ మరింత జాప్యమయ్యే పరిస్థితులు కనిపిస్తుండగా, ఆన్‌లైన్‌లో ఎంట్రీ కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మందికిపైగా డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించింది. వారికి ఇప్పటివరకు శిక్షణను పూర్తి చేయలేదు. తప్పులు దొర్లకుండా డేటా ఎంట్రీ చేపట్టాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో డేటా ఎంట్రీ కూడా మరిన్ని రోజులు పట్టే పరిస్థితులే కనిపిస్తున్నాయి. మొత్తంగా ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువులో సర్వేను పూర్తి చేయడం కష్టమేనని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### చదువులు ఆగం

ఇంటింటి సర్వే ఏమోగానీ పిల్లల చదువులు ఆగమవుతున్నాయని ఇటు తల్లిదండ్రులు, మరోవైపు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సర్వే కోసం మధ్యాహ్నం వేళ పాఠశాలలకు సెలవు ప్రకటించడం వల్ల విద్యార్థుల చదువులు సరిగా సాగడం లేదని వారంటున్నారు. పిల్లలపై పర్యవేక్షణ కూడా కరువైందని తెలుపుతున్నారు. మరోవైపు మధ్యాహ్నం వేళ ఇటు ఇండ్ల లోనూ ఎవరూ అందుబాటులో ఉండటం లేదని, దీంతో సమాచార సేకరణ కష్టతరంగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. సెలవుల్లో సర్వే చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించకుండా, ప్రభుత్వం అనాలోచితంగా సర్వే చేపట్టిందని విద్యార్థులు తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

## సర్వేకు దూరంగా సీఎం, మంత్రులు!

- సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలివ్వని వైనం
- అదే బాటలో పీసీసీ చీఫ్
- పట్టించుకోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు
- మేమెందుకు ఇవ్వాలంటూ ప్రజల నిరాకరణ
- రాష్ట్రంలో అభాసుపాలవుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే

హైదరాబాద్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటంబ సర్వేకు సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు తమ వివరాలు ఇవ్వనేలేదనే అంశం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలు అసలు పట్టించుకోవడమే లేదు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా వివరాలు ఇవ్వనేలేదు. దీంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ఆదర్శంగా ఉండాల్సిన వీరే సర్వేకు వివరాలు ఇవ్వనప్పుడు తామెందుకు ఇవ్వాలంటూ ఎన్యుమరేటర్లను పలుచోట్ల సామన్య జనం ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 6 నుంచి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సర్వేపై ఎలాంటి అపనమ్మకం పెట్టుకోవద్దని, నిర్భయంగా వివరాలు ఇవ్వాలంటూ సీఎంతోపాటు మంత్రులంతా ప్రజలకు పిలుపునిచ్చారు. తీరా చూస్తే సీఎంతోపాటు మంత్రులంతా సర్వేలో తమ కుటుంబాల వివరాలు ఇవ్వకపోవడం గమనార్హం. సర్వే తొలిరోజున గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కుటుంబ వివరాలను మాత్రం అధికారులు సేకరించారు. ఆ తర్వాత మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్ కుటుంబ సర్వేలో వివరాలు ఇచ్చినట్టుగా వార్తలు వచ్చాయి. సీఎంతోపాటు మిగిలిన మంత్రులు తమ వివరాలను ఇచ్చినట్టు ఎక్కడా ప్రకటించలేదు. ఇటు హైదరాబాద్‌లో, అటు జిల్లాల్లోనూ వారు తమ వివరాలు ఇవ్వలేదని తెలిసింది. రెండురోజుల క్రితం సీఎం సీపీఆర్వో అయోధ్యరెడ్డి ఎక్స్‌లో కుటుంబ సర్వేకు సంబంధించి ఒక పోస్ట్ చేశారు. దీనిపై అజయ్‌రెడ్డి అనే ఓ నెటిజన్ స్పందిస్తూ.. ఎంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో తమ వివరాలు ఇచ్చారో తెలపాలని, ఆ వివరాలను పోస్ట్ చేయాలని కోరారు. కానీ ఈ ప్రశ్నకు సీపీఆర్వో నుంచి సమాధానం లేకపోవడం గమనార్హం. దీంతో సర్వేలో సీఎంతోపాటు మంత్రులు తమ వివరాలను ఇవ్వలేదనేది తేటతెల్లమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### సర్వేపై అనుమానపు జాడలు

కుటుంబ సర్వేపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆస్తుల వివరాలు, ఇతర వ్యక్తిగత వివరాల సేకరణపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అనేక చోట్ల ఈ వివరాలను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో సర్వే కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఈ నేపథ్యంలో ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన సీఎం, మంత్రులు తమ వివరాలు ఇవ్వడంపై వెనుకంజ వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక పథకాన్ని ప్రారంభిస్తే.. తొలుత ప్రభుత్వ లేదా పార్టీ పెద్దల నుంచే ప్రారంభించడం ఆనవాయితీ. కానీ, ఆస్తుల వివరాలు ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఏర్పడుతాయోననే ఆందోళనతో వారంతా సర్వేకు దూరంగా ఉంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

### స్పందించని హైదరాబాద్ కలెక్టర్

కుటుంబ సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర మంత్రుల కుటుంబాల వివరాలను సేకరించారో లేదో తెలుసుకునేందుకు సర్వే నోడల్ ఆఫీసర్‌గా ఉన్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని 'నమస్తే తెలంగాణ' సంప్రదించింది. ఆయనకు ఫోన్ చేయగా స్పందించలేదు. వాట్సప్‌లో మెసేజ్‌కు కూడా స్పందన కరువైంది.

### తలలు పట్టుకుంటున్న ఎన్యూమరేటర్లు

కుటుంబ సర్వేలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ కుటుంబాల వివరాలు ఇవ్వకపోడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజలు తమ వివరాలివ్వాలని ఆదేశిస్తున్న వాళ్లంతా ఎందుకు ఇవ్వడం లేదని ఎన్యూమరేటర్లకు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ముందుగా వాళ్ల వివరాలు తీసుకొని ఆ తర్వాత తమ వద్దకు రావాలని కరాఖండీగా చెప్పేస్తున్నారు. దీంతో ఏం సమాధానం చెప్పాలో తెలియక ఎన్యూమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు.

## 'ఫొటోషూట్ కోసమే కిషన్‌రెడ్డి మూసీ నిద్ర'

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫొటోషూట్ కోసమే మూసీ నిద్ర చేశారని టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. ఆయన అక్కడ నిద్రించే ముందు దోమలు, ఈగల మందు కొట్టించారని ఆరోపించారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే 3 నెలలపాటు అక్కడే బస చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్‌ఫ్రంట్ గురించి గొప్పగా చెప్పిన ఆయన, మూసీ పునరుద్ధరణపై విమర్శలు చేయడం విడ్డూరమని పేర్కొన్నారు. బీజేపీ అడ్డుకోవాలని చూసినా మూసీ ప్రక్షాళన ఆగదని తేల్చిచెప్పారు.

## ఇండ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

- సర్కార్ ఇండ్లు కూల్చేది రియల్ ఎస్టేట్ కోసమా..? కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసమా?
- సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

జీ కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, నవంబర్ 17 : ఇండ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా? అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలపై యుద్ధం ప్రకటించి ఇండ్లు కూల్చుతున్నదని ఆరోపించారు. అంబర్‌పేట నియోజకవర్గం గోల్కొండ డివిజన్ తులసీరాం నగర్ లంక బస్తీలో 'మూసీ నిద్ర'లో భాగంగా కిషన్‌రెడ్డి శనివారం రాత్రి శంకరమ్మ ఇంట్లో నిద్ర చేశారు. ఆదివారం ఉదయం అల్పాహారం కూడా అక్కడే చేశారు. అనంతరం బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. పేదల ఇండ్లపై బుల్డోజర్లు ఎక్కిస్తాం.. అడ్డమొచ్చినవారిని తొక్కిస్తాం.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇండ్లు కూలగొట్టేది రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమా? కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసమా? అనేది ప్రభుత్వం స్పష్టంచేయాలన్నారు.

## 'ఇవి ప్రభుత్వ హత్యలే'

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకులాల్లో విద్యార్థుల మరణాలు చోటుచేసుకుంటున్నాయని, ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పీడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, కార్యదర్శి కుమార్, రాష్ట్ర నాయకుడు కోట ఆనంద్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యలు నిత్య కృత్యమయ్యాయని ఆరోపించారు. ఈఘటనలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

## వైద్యశాఖ ఉద్యోగాలపై దళారుల కన్ను

- నేతలు, అధికారులు దళారుల అవతారం
- లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఇంటి దొంగలు
- మోసపోవద్దని మంత్రి దామోదర ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖలో అవినీతి తారస్థాయికి చేరిపోయింది. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు ప్రభుత్వం తూతూ మంత్రం చర్యలతో సరిపెట్టడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. వైద్యారోగ్యశాఖలో అవినీతి జరిగినా ఎవరూ పట్టించుకోరులే అనే ధీమాతో దందాలకు దిగుతున్నారు. ఇప్పుడు కొత్త నోటిఫికేషన్లలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రాజకీయనేతలు, అధికారులు కుమ్మక్కయి దళారుల అవతారం ఎత్తారు. నిరుద్యోగుల నుంచి లక్షలు వసూలు చేస్తున్నారని వైద్యారోగ్యశాఖవర్గాల్లో చర్చ జరుగుతున్నది. దీంతో దళారులను నమ్మవద్దని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మరోవైపు మంత్రి స్పందించి ప్రకటన చేయాల్సి వచ్చిందంటే ఈ దందా ఏ స్థాయిలో జరుగుతున్నదో అర్థమవుతున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఎవరేం చేస్తారులే అనే ధీమా!

వైద్యశాఖలో వరుసగా అవినీతి ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవినీతి యథేచ్ఛగా సాగిపోతున్నది. డిప్యూటేషన్ల కోసం డబ్బులు తీసుకుంటున్నారంటూ ఓ ఉన్నతాధికారిపై ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోలేదు. బదిలీల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఉద్యోగులు ఆందోళనలు చేపట్టారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ ఎంక్వయిరీ అంటూ మంత్రి హడావుడి చేసినా ఆ విచారణ ఏమైందో ఎవరికీ తెలియదు. వరుసగా అవినీతి ఆరోపణలు వచ్చినా విచారణలు జరిగినా చర్యలు శూన్యం కావడంతో వైద్యారోగ్యశాఖలో అక్రమాలకు అడ్డుకట్టపడటం లేదు.

### '108'ని పటిష్టం చేస్తాం: దామోదర

108 సేవల పటిష్టానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర పేర్కొన్నారు. 108 నంబర్‌కు సమాచారం రాగానే మిషన్ ఆఫ్ సేవింగ్ లైవ్స్‌లో భాగంగా ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను దవాఖానకు తరలిస్తారని తెలిపారు. అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేసి దవాఖానలో మెరుగైన చికిత్స అందించేలా నెట్‌వర్క్ రూపొందిస్తున్నామని చెప్పారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాలో గుండెపోటుకు గురైన వ్యక్తిని 108 డ్రైవర్ మధ్యలోనే వదిలేసిన ఘటనపై మంత్రి స్పందించారు. దీనిపై విచారణ చేపట్టాలని 108 సీవోవో ఖలీద్‌ను ఆదేశించారు.

## మామునూర్ ఎయిర్‌పోర్టుకు రూ. 205 కోట్లు

### భూసేకరణ కోసం విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ ఉడాన్ పథకంలో భాగంగా రాష్ట్రంలో చేపట్టాల్సిన మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో ముందడుగు పడింది. తెలుగు బిడ్డ రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఈ ఎయిర్‌పోర్టు ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణలో 6 ప్రాంతీయ ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై అధ్యయనం కోసం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) టెక్నో ఎకనమిక్ ఫీసిబిలిటీ రిపోర్ట్ (టీఈఎఫ్ఆర్) కన్సల్టెంట్‌ను ఏర్పాటు చేయడంతో సంబంధిత కమిటీ మామునూరు ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు యాజమాన్యం గత నెల 23న నిరభ్యంతర పత్రాన్ని జారీచేసింది. దీంతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు అవసరమైన నిధులు విడుదల చేయడంతో పాటు త్వరగా భూసేకరణ పూర్తిచేయాలని వరంగల్ కలెక్టర్‌ను ఆదేశించింది.

## ఈశాన్యానికి గేట్లు.. మారనున్న రూట్లు!

- సచివాలయంలో వాస్తుమార్పులు
- గేట్ల తొలిగింపు పనులు పూర్తి
- గేట్-4కు సమీపంలో కొత్త ద్వారం ఏర్పాటు
- కొత్త మార్గం నుంచే సీఎం రేవంత్‌రెడ్డి రాకపోకలు

కొత్తగా ద్వారం ఏర్పాటు కోసం ఈశాన్యం వైపు గ్రిల్స్ తొలగిస్తున్న సిబ్బంది

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సచివాయలంలో వాస్తు మార్పులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రెండుమూడు విడతలుగా వాస్తు మార్పులు చేసినా పెద్దగా మార్పు కనిపించకపోవడంతో తాజాగా మరోసారి మార్పులు చేస్తున్నారు. ఈసారి ఏకంగా సచివాలయం ఎదురుగా ఉన్న ప్రధాన ద్వారాన్నే తొలిగిస్తున్నారు. దీంతోపాటు రోడ్ల నిర్మాణం, సీఎం, మంత్రులు వచ్చిపోయే 'రూట్'లలో భారీగానే మార్పులు జరుగుతున్నాయి. వాస్తవానికి సచివాలయానికి ఎదురుగా తూర్పువైపు ఉన్న ప్రధాన మహాద్వారాన్ని ప్రభుత్వం ఆరు నెలల కిందటే మూసివేసింది. వాస్తు మార్పుల్లో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచే గేటుకు తాళం వేశారు. ఆ మార్గం నుంచి ఎలాంటి రాకపోకలు జరగడం లేదు. పొరబాటున కూడా గేటు తెరువకుండా ఏకంగా ఇనుప తీగలు చుట్టేశారు. ఆదివారం మహాద్వారం గేట్లను తొలిగించారు. ద్వారాన్ని కూడా తొలిగించనున్నారు. చుట్టూ ఉన్నట్టుగానే రెయిలింగ్ ఏర్పాటు చేస్తారు. ప్రధాన ద్వారాన్ని ఈశాన్యంవైపు జరిపి ఉత్తరం ద్వారానికి సమీపంలో నిర్మిస్తారు. ఈ మేరకు ఇప్పటికే అక్కడ రెయిలింగ్‌ను తొలిగించారు.

### గేట్లతో పాటు రూట్లు

వాస్తుమార్పుల్లో భాగంగా రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రధాన ద్వారం ఉన్న ప్రహరీకి ఆనుకొని ఉన్న గేట్-2, గేట్-3ని కలుపుతూ 27 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. మొత్తంగా ఈ పనులకు ప్రభుత్వం రూ.3.20 కోట్లు ఖర్చు చేస్తున్నది. పనులు పూర్తయిన తర్వాత సీఎం రేవంత్ కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈశాన్య మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. మంత్రులు సైతం ఇదే మార్గాన్ని వినియోగించనున్నారు.

### మార్పులు చేసినా కనిపించని మార్పు

సీఎం రేవంత్ అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటికే పలుసార్లు వాస్తుమార్పులు చేశారు. మొదట సీఎం కాన్వాయ్‌లోని తెలుపు కార్లను తొలిగించి, నలుపు రంగు కార్లు తెచ్చిపెట్టారు. రేవంత్ అదృష్ట సంఖ్య 9 అని, కాన్వాయ్‌లో 9 కార్లు, వాటి నంబర్ ప్లేట్లపై 9 అంకె వచ్చేలా చూసుకున్నారు. మొదట్లో తూర్పు వైపు మహాద్వారం మీదుగా రేవంత్ రాకపోకలు సాగించేవారు. కానీ పాలన గాడిన పడకపోవడంతో వాస్తు మార్పుల్లో భాగంగా జూన్‌లో ఆ గేటును మూసివేశారు. పశ్చిమం గేటు ద్వారా రాకపోకల